గారు యీ సాహాసోపేతమైన రచనకు గడం గక పోదురేమో.

"న్యాయసూత్రాలు నైతికరీత్యా సమర్థనీయాలై వుండాలనే విషయం ఛాదరిగారి దృష్టికి తీసుకురావాలని మాత్రమే నా ప్రయత్నం" అంటున్నారు శ్రీ యమ్. వి. ఆర్ గారు. ఇందుకు కృతజ్ఞుడ్ని. కాని యీ ప్రయత్నంచేసేముందు నైతిక సిద్ధాంతాలను వల్లెవేసే శ్రీ యమ్. వి. ఆర్ గారిపై అధమం జెనివా ఒప్పందంయొక్క పూర్తి పాఠాన్నైనా చదవవలసిన నైతిక బాధ్యత కాదా? అటు అమెరికా, యిటు చైనా జెనీవా ఒప్పందాన్ని అనుసరించి సమస్య పరిష్కరింపబడాలంటున్నారు. శ్రీ యమ్. వి. ఆర్. గారు నైతిక సూత్రాలను గూడా గుర్తించాలంటున్నారు. అయినప్పుడు, జెనీవా ఒప్పందం నైతికంగా ఎంతవరకు సమగ్రనియమన్న విషయం జెనివా [illegible] తేసేగాని తెలియదు. శ్రీ యమ్. వి. ఆర్. గారు చదివే ఓపిక లేకుండానే వ్యాఖ్యానికి పూనుకొన్నారు.

వివాదంలో యిమిడివున్న వివిధ అంశాలను క్షుణ్ణంగా చదవకుండానే, వ్రాసే, ఉపన్యసించే దబాయింపురాయిళ్ల పద్ధతులను మనం అందరు ఖండించుదాం. వ్రాయబూనిన విషయం లోతు తెలియనప్పుడు దిగకుండా వుండుటకు మేలని చెప్పుదాం. సోవియట్ దేశాన్ని పొగడేవారంతా సోవియట్ విషయాలు తెలిసినవారెలా కాజాలరో, భారతప్రభుత్వ చర్యను హర్షించినంత మాత్రాన, ఎవ్వరూ అంతర్జాతీయ న్యాయశాస్త్రవేత్తలు కాలేరు.

(ఈ చర్చ ఇంతటితో ఆఖరు—సం. తెలుస్వ.)

కథానిక

# "దగాపడిన తమ్ముళ్లు"

అంగర సూర్యారావు

"ఇవాళకి ఇకపని చెయ్యలేనోయ్!" అన్నాడు రామ్మూర్తి రాసిన కాగితాలను ట్రేలో వేస్తూ. "మైను 5 గంటలు కానిదే పని మానేస్తే ఎలా?" అన్నాను.

"నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బ తిందోయ్ రఘూ! విసుగు విరామంలేకుండా గంటలతరబడి పనిచేసే ఇదివరకటి రామ్మూర్తిని కాను నేను. లే! ఒకసారి అలా సముద్రం ఒడ్డుకుపోయి విశ్రాంతి తీసుకుందాం!" అన్నాడు.

నాకుకూడా బద్ధకంగా వుంది. విశ్రాంతి అన్నమాట నన్ను ఆకర్షించింది లేచాను. కాఫీ తాగకండా అడుగైనా ముందుకు వెయ్యలేనన్నాడు రామ్మూర్తి. ఇద్దరం హోటలుకు వెళ్ళాం. అంతవరకు నీరసంగావున్న రామ్మూర్తి ముఖంలో కాఫీ తాగినతర్వాత చురుకుతనం కనిపించింది. "రోజుకు యిన్నిసార్లు కాఫీ తాగడం మంచిపనికాదు" అన్నాను.

"మంచిపని కానిమాట నిజమే! కాని నేను కనీసం రెండుగంటలకు ఒకసారైనా కాఫీ తాగకపోతే పని చెయ్యలేను. ప్రతి త్రాగుబోతుకీ త్రాగుడు దురలవాటు అన్న విషయం తెలుసు. కాని వచ్చిన చిక్కు ఎక్కడ అంటే అది మానేసేదగ్గరే!" అన్నాడు రామ్మూర్తి.

నిజమే! చాలామంది మనుషులు తాము చేసే పనులు చెడ్డవని తెలిసివుండి కూడా చేస్తూ వుంటారు. అది మానసిక దౌర్బల్యమో! పరిస్థితుల ప్రాబల్యమో!

సముద్రంమీదినుంచి వచ్చే చల్లనిగాలి మా మనసుల్ని ఆఫీసు కాగితాలమీదినుంచి ప్రపంచం మీదికి మరల్చింది. ఇద్దరం ఇసుకలోకి దిగి కూర్చున్నాం. జీతంచాలని గుమాస్తా కుటుంబంలా మాముందు సముద్రం గోల పెడుతోంది.

రెండేళ్ళక్రితం రామ్మూర్తీ నేనూ యీ ఆఫీసులో పనిచేస్తూన్నాళ్ళం. నిరంకుశుడైన పై

అధికారిని ఎదిరించడంవల్ల రామ్మూర్తి ఐదుజిల్లాల చివరకు, నేను మూడుజిల్లాల చివరకు ట్రాన్సుఫరు చెయ్యబడ్డాం. తిరిగి కాలప్రవాహంలో యీదుకొని యీనాటికి యిద్దరం యీ ఆఫీసు చేరుకోగలిగాం. కాని నాకంటే బలంగావుండే రామ్మూర్తి ఎముకలగూడులా తయారయాడు.

"నీకు యీ రెండేళ్ళలో ఏమైనా జబ్బు చేసిందా?"

"ఉహుఁ! జబ్బేమీ లేదు. డబ్బులేకపోవడమే జబ్బు. చూడు! నిన్న జీతం తీసుకున్నాను. యివేళ నాజేబులో కానీలేదు. యిప్పుడు యింటికి వెడితే బాకీలవాళ్లు వచ్చి పడతారు. వాళ్ళకేం సమాధానం చెప్పాలి? యింట్లో బియ్యంలేవు. రేపటినుంచి భోజనం ఎలా? భోజనంలేకపోతే కాఫీతాగి పడివుంటాను నేను. పాలకోసం ఏడ్చే చంటికుర్రాణ్ణి ఏంచెయ్యడం? ఒకటవ తేదీకోసం ఎదురుచూస్తూ యింకా ముప్ఫయి రోజులు గడపాలి!" నిట్టూర్చాడు రామ్మూర్తి.

మా భారమైన జీవితాలను తలుచుకొని యిక్కడకూడా బాధపడుతూ కూర్చోవడం యిష్టంలేక ప్రసంగాన్ని మార్చాం.

* * *

ఒకరోజు రామ్మూర్తి ఆఫీసుకు రాలేదు. కారణం ఏమిటో తెలుసుకుందామని ఆ సాయింత్రము ఆఫీసునుంచి వాళ్ళయింటికి బయలుదేరాను. కొన్ని సందులు ఉపసందులుదాటి రామ్మూర్తి యిల్లు చేరుకున్నాను. నన్ను చూడగానే రామ్మూర్తి లోపలికి రమ్మన్నాడు. గాలి వెలుతురు రాని ఆ గదిలో సాయింత్రం ఐదు గంటలకే దీపం వెలిగించివుంది. ఆ మసక దీపపు కాంతిలో ఒక ఆరేళ్ళపిల్ల మంచంమీద పడుకొని మూలుగుతూ కనిపించింది. రామ్మూర్తి దిగులుగా కూర్చుని వున్నాడు.

"జ్వరం వచ్చిందా?" అన్నాను.

"అవునోయ్! దానికి మూడు రోజులనుంచి జ్వరం వస్తోంది. అదే పోతుందని వూరుకుంటే యీరోజు మరీ ఎక్కువయ్యింది" అన్నాడు నిరుత్సాహంగా.

"ఏమందూ వెయ్యకపోతే ఎలాపోతుంది? లే! వూళ్లోకివెళ్ళి ఏదైనా మందుతీసుకువద్దాం!" అన్నాను. యింతలో ఒక నాలుగేళ్ళకుర్రాడు బయటనుంచి పరుగెత్తుకువచ్చి "అణా కావాలని" మారాం పెడుతున్నాడు. వాడిచేతిలో అణా పెట్టేవరకూ వాడు నన్ను బయటకు వెళ్ళడానికి పర్మిషను యివ్వలేదు. నేను ఆ యింట్లో అడుగు పెట్టింది మొదలు బయటకు వచ్చేవరకూ చంటికుర్రాడి ఏడుపు ఐదు నిముషాలకు ఒకసారి రిపీట్ అలారంలా వినిపిస్తూనే వుంది. నరకం అనేది ఎక్కడో వుందంటారు. కాని రామ్మూర్తియిల్లు చూసినవాళ్ళు ఆ అభిప్రాయాన్ని తప్పకుండా మార్చుకుంటారు. ఆ రాత్రి తెలిసినడాక్టరు దగ్గర మందుతీసుకొని రామ్మూర్తికియిచ్చి పంపించాను.

వారంరోజులు గడిచాయి. ఆరోజు ఉదయం రామ్మూర్తి నా లాడ్జికివచ్చాడు. ఆ నాలుగేళ్ళ కుర్రాడుకూడా అతనితో వచ్చాడు. ఇద్దరం కూర్చున్నాం. కుర్రాడుమాత్రం గదిలో తనకు పనికివచ్చే వస్తువులకోసం వెతుక్కుంటున్నాడు.

"మా ఆవిడకు రెండురోజులనుంచి జబ్బుగా వుందోయ్. ఈ పిల్లలతో నేనొక్కడినీ బాధ పడలేకపోతున్నాను, దాన్ని యిద్దరు పిల్లల్నీ వాళ్ళమ్మగారి యింటిదగ్గర విడిచిపెట్టి రేపు వస్తాను. ఈ కుర్రాణ్ణిమాత్రం యీ రెండురోజులు నీదగ్గర వుంచుకుంటే చాలా సంతోషిస్తాను. నువ్వు తప్పకుండా నాకీ ఉపకారం చెయ్యాలి" అన్నాడు రామ్మూర్తి విచారంగా.

"ఆమాత్రం దానికి యింతగా చెప్పాలా? వాణ్ణి రెండురోజులే,కాదుకదా ఎప్పుడూ నాదగ్గరే వుంచుకోమన్నా వుంచుకుంటాను" అన్నాను.

రామ్మూర్తి కుర్రాణ్ణిపిలిచి "ఒరేయ్ సుందరం నేను వూరికెళ్ళివస్తాను. ఈ రెండు రోజులూ మామయ్యదగ్గర వుండు!" అన్నాడు.

అణా యిస్తే వుంటానన్నాడు వాడు.

సుందరం అణా తీసుకొని నాదగ్గరే వుండి పోయాడు. రామ్మూర్తి వెళ్ళిపోయాడు. సుందరం చాలా అల్లరిచేస్తాడు. జబ్బుతోవున్న వాళ్ళమ్మను యింకా బాధ పెడతాడనే వుద్దేశంతో రామ్మూర్తి వాణ్ణి నాదగ్గర విడిచిపెట్టి వెళ్ళాడు. కాని యీ రెండు రోజుల్లోనూ కుర్రాళ్ళలో సుందరం అంతటి బుద్ధిమంతుడు వుంటాడా అనిపించింది నాకు, ఏమీ అల్లరి చెయ్యలేదు. మరిచిపోకుండా అణామాత్రం వసూలుచేసి బిస్కట్లు కొనుక్కునే వాడు. సాయింత్రం నాతో బీచికి వచ్చేవాడు.

కలిగిన ప్రతిసందేహం నన్నడిగి తీర్చుకునేవాడు. యీ కుర్రాడు ఎప్పుడూ నాతోవుంటే బాగుం టుందనిపించింది నాకు. నా కోరికకూడా తీరింది. రామ్మూర్తి రెండురోజులు పోయిన తరవాత వచ్చి రమ్మన్నా వాడు వెళ్ళలేదు.

ఒకనాడు ఆఫీసులో పనిచేస్తూ రామ్మూర్తి సొమ్మసిల్లి పడిపోయాడు. నేనూ మరో యిద్దరు గుమస్తాలు ముఖంమీద నీళ్లుచల్లి ఉపచారాలు చేసిన తరవాత అరగంటకు రామ్మూర్తికి కళ్ళు తెరిచాడు.

"ఎలావుంది?" అన్నాను.

"చాలా ఆయాసంగా వుంది" అన్నాడు బాధగా.

వెంటనే జట్కామీద హాస్పిటలుకు తీసుకు వెళ్ళాం. డాక్టరు పరీక్షచేసి "జబ్బుబాగా ముదిరిన తర్వాత తీసుకునస్తే ఏం లాభం?" అన్నాడు.

"ఏం జబ్బు?" అన్నాను ఆశ్చర్యంగా.

"క్షయ" అన్నాడు డాక్టరు.

నా గుండెలు వేగంగా కొట్టుకున్నయ్. రామూర్తికి క్షయా! అతన్ని పట్టుకొని నెమ్మదిగా నడిపిస్తూ డాక్తరు చూపించిన 13వ నెంబరు బెడ్ మీద పడుకోబెట్టి దిగులుగా నా లాడ్జి చేరుకున్నాను.

నాటినుండి రోజూ సుందరాన్ని తీసుకొని సాయంత్రం 4 గంటలకు హాస్పిటలుకు వెళ్ళడం కూడా నా దైనిక కార్యక్రమాలలో ఒకటయ్యింది.

రామ్మూర్తి రోజురోజుకూ క్షీణించిపోతున్నాడే కాని కొంచెంకూడా గుణం కనిపించలేదు. ఒక నాటి సాయంత్రం—

"సుందరాన్ని బయటకు పంపించు. నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" అన్నాడు రామ్మూర్తి నీరసంగా. సుందరం జేబులో బిస్కట్లు వేసి ఆడుకోమని గ్రోటన్సు మొక్కలదగ్గర విడిచి పెట్టి వచ్చాను.

రామ్మూర్తి ఆయాసంతో నెమ్మదిగా చెప్పడం ప్రారంభించాడు

"రఘూ! నువ్వు నన్ను ఎంతోకాలంనుంచి సొంతమనిషిలా చూస్తూవచ్చావు. యిక నా జీవితం కొన్ని గంటలలో ముగియబోతుంది. నా చివరి కోర్కె తీర్చమని కోరుతున్నాను. సుందరాన్నిమాత్రం నీదగ్గరే వుంచుకొని పెద్దవాణ్ణి చెయ్యి. వాడికేదైనా వృత్తివిద్య నేర్పకాని గుమాస్తానుమాత్రం చెయ్యకు."

ఆటముగించి మాదగ్గరకు వచ్చిన సుందరాన్ని దగ్గరకు పిలిచి "ఒరేయ్ సుందరం! నేను వూరికి వెళ్లిపోతున్నాను. నువ్వు మామయ్య దగ్గరే వుండు." అన్నాడు రామ్మూర్తి.

"నువ్వువెళ్ళిపో నాన్నా! నేను మామయ్య దగ్గరే వుంటాను" అన్నాడు సుందరం ఉత్సాహంగా! రామ్మూర్తి ముఖంలోకూడా ఆనందం కనిపించింది. నా కన్నీరు ఆ తండ్రీ కొడుకులకు కనిపించకుండా నేనుమాత్రం ముఖం పక్కకు తిప్పుకున్నాను.

# ఆశాగానం

"అమరేంద్ర"

వగపెందుకు నరుడా?
దిగులెందుకు మరుడా?
నిను వీడని నెచ్చెలినై
నీ గుండెల నేనుండగ!
బడలికతో అడుగడుగున
తడబడు నీ పదములందు
కనజాలని గమనమునై
మునుముందుకు నడిపింపగ?

శిధిల శిశిర హృదయంలో
నిదురించే నవవసంత
మధురిమ నేనోయీ!
కాళరాత్రి గర్భంలో
కలలుకనే శుభప్రభాత
బాలను నేనోయీ
అరిపోని జ్వాలను నేనోయీ!
దిగులు విడవోయీ!
ఈ జగమే నీదోయీ!